సాక్షి
వనపర్తి

సోమవారం, 7, ఆగస్టు, 2023



జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద క్రమంగా తగ్గుతోంది.

వివరాలు 8లో ▸



రాజ్యాధికారమే లక్ష్యం

బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పీ పనిచేస్తోందని ప్రవీణ్‌కుమార్ అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.1/24.2

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.


న్యూస్‌రీల్

గద్దర్ మృతి తెలంగాణకు తీరని లోటు



వనపర్తిటౌన్: ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటని మాజీ మంత్రి, టీపీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ డా. చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి జిల్లాకేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో పార్టీ పట్టణశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోయడంలో గద్దర్ గళం యావత్తు సమాజాన్ని జాగృతం చేసిందన్నారు. కాంగ్రెస్ అగ్ర నాయకుల సభల్లోనూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారని, అలాంటి ఉద్యమకారుడిని కోల్పోవడం తెలంగాణకు తీరని లోటని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో చట్టసభల్లో ప్రజల పక్షాన తన గళం వినిపించాలనుకున్న గద్దర్ లేకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, మత్స్యకార సంఘం జిల్లా చైర్మన్ నందిమళ్ల యాదయ్య, కౌన్సిలర్ జయసుధ మధుగౌడ్, ఓబీసీ జిల్లా చైర్మన్ కోట్ల రవి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సమద్, నాయకులు జనార్దన్, మాజీ కౌన్సిలర్ కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి హజ్రత్ ఉర్సు



ఆత్మకూర్: పట్టణంలో హజ్రత్ సయ్యద్‌షా సాహెబ్, హజ్రత్ సయ్యద్ మౌలానా సాహెబ్ ఉర్సు మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. మంగళవారం రాత్రి 8 గంటలకు జమేదార్ వీధిలోని ఎక్బాల్‌బిన్ సయ్యద్ ఇంటి నుంచి ప్రత్యేక అలంకరణతో గంధోత్సవ ఊరేగింపు ప్రారంభం కానుంది. రాత్రి 11 గంటలకు దీపారాధన, ప్రముఖ గాయకులతో ఖవ్వాలి, 9వ తేదీ ఉదయం 10 గంటలకు ఖత్మే ఖురాన్, ఫాతేహా, మధ్యాహ్నం ఒంటిగంటకు దర్గా ప్రాంగణంలో భక్తులకు అన్నదానం ఉంటుందని నిర్వాహకుడు ఖమర్ బిన్ సయ్యద్ తెలిపారు. ఉర్సుకు గుల్బర్గా, హల్‌కట్టా, వట్టింషరీఫ్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రముఖ ముర్షద్‌లు, బాబాలు, పూజ్య గురువులు హాజరుకానున్నారని తెలిపారు. ఉర్సుకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

చేనేత వేడుకలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లో సోమవారం జరిగే జాతీయ చేనేత దినోత్సవ వేడుకలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రీజినల్ మేనేజర్ శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ డిపో నుంచి 2 బస్సులు, నారాయణపేట డిపో నుంచి 6, గద్వాల నుంచి 4, వనపర్తి నుంచి 2 బస్సులు నడుపుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.

నేతన్నకు చేయూత..

అభివృద్ధి పథంలో అమరచింత చేనేత ఉత్పత్తుల సంఘం



అమరచింతలోని చేనేత ఉత్పత్తిదారుల సంఘం భవనంలోని మగ్గాలు

- మూడేళ్లుగా కొనసాగుతున్న విక్రయాలు
- దేశంలోని పలు రాష్ట్రాల్లో పట్టు వస్త్రాల ప్రదర్శనలు
- 40 మందితో ప్రారంభమై 445 మందికి విస్తరణ



చేనేత ఉత్పత్తిదారుల సంఘం భవనం

అమరచింత: మగ్గంపై ఆధారపడి జీవిస్తున్న చేనేత కార్మికులు ఉపాధి కరువై వృత్తిని వదిలి ఇతర కూలీ పనులకు వెళ్లే పరిస్థితి నుంచి నేడు చేనేత ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసుకొని సొంతంగా క్రయ విక్రయాలు చేపట్టి లాభాలు ఆర్జించే స్థాయి ఎదిగారు. 40 మందితో ప్రారంభమైన సంఘం ప్రస్తుతం 445 మందితో కొనసాగుతోంది. కార్మికులకు ఉపాధి కల్పిస్తూ ప్రతి నెల క్రమం తప్పకుండా వేతనాలు చెల్లిస్తున్నారు. ఒక్కో కార్మికుడు నెలకు రూ.12 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనం పొందుతున్నారు. వేతనాలే కాకుండా చీరల అమ్మకాలతో వచ్చిన లాభాల్లో ప్రతి ఒక్కరికి వాటా ఇస్తున్నారు. నాబార్డ్ రుణం రూ.రెండు కోట్లు మంజూరు కావడంతో షెడ్ నిర్మాణంతో పాటు మగ్గాలు సమకూర్చుకున్నారు.

ఇదీ కథ..

అమరచింతకు చెందిన మహంకాళి శేఖర్ అనే యువకుడు చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పలుమార్లు స్థానిక కార్మికులతో సమావేశాలు నిర్వహించి సొంతంగా చేనేత వస్త్రాల తయారీ, విక్రయదారుల సంఘం ఏర్పాటు చేసుకుందామని ఒప్పించారు. 2019లో 20 మంది కార్యవర్గంతో సంఘం ఏర్పాటు చేయగా అప్పట్లో రూ.24 వేలు మాత్రమే ఉన్నాయి. 2020 కోవిడ్ సమయంలో ఎంఎస్ఎంఈ ద్వారా రూ.2 కోట్లు, నాబార్డ్ గ్రాంట్ రూ.5 లక్షలు మంజూరు చేసుకొని పట్టణంలో ప్రభుత్వం కేటాయించిన ఎకరా స్థలంలో భవనం, 135 మగ్గాలు, కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కరోనా అనంతరం 2021, జనవరిలో 10 మగ్గాలపై జరి చీరల తయారీ ప్రారంభించారు. 2021, మార్చిలో రూ.25 వేల అమ్మకాలు ఉండగా.. 2022, మార్చి నాటికి అది రూ.65 లక్షలకు చేరింది. రోజురోజుకు అభివృద్ధి చెందుతూ 2023, మార్చి నాటికి సంఘం ఆధ్వర్యంలో చేనేత వస్త్రాల తయారీ, అమ్మకాల ద్వారా రూ.కోటి వ్యాపారం జరిగిందని కంపెనీ సీఈఓ వెల్లడించారు.

40 మందితో ప్రారంభమై..

అమరచింత చేనేత ఉత్పత్తిదారుల సంఘం 2019లో 40 మంది సభ్యులతో ప్రారంభమైంది. 20 మంది కార్మికులతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి కలిసి శ్రమించడం, తయారు చేసిన ఉత్పత్తులను అమ్మడం ద్వారా వచ్చిన ఆదాయాన్ని సమానంగా పంచుకోవడం. ప్రతి నెల వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఒక్కొక్కరుగా ముందుకొచ్చి కంపెనీలో సభ్యత్వం పొంది భాగస్వాములయ్యారు. 2021లో 10 మగ్గాలతో ప్రారంభమైన సంఘం ప్రస్తుతం 130 మగ్గాలతో కొనసాగుతుంది. సంఘం నిర్వహణకు నాబార్డ్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం ఉండటంతో అంచలంచెలుగా ముందుకు సాగుతుంది.

ఉపాధి పొందుతున్నా..



గతంలో మాస్టర్ వీవర్స్‌పై ఆధారపడి మగ్గాలపై చీరలు తయారు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడిని. ప్రస్తుతం సంఘం ద్వారా ముడి సరుకుతో పాటు మగ్గాన్ని ఇచ్చారు. తయారు చేసిన చీరలకు మాస్టర్ వీవర్స్ కంటే అధికంగా ఇస్తుండంతో మూడేళ్లుగా జరీ చీరలు తయారు చేస్తున్నా. నెలకు మూడు చీరల తయారీతో రూ.12 వేలు పొందుతున్నా.

– దాస్‌పత్తి తిమ్మయ్య, నేత కార్మికుడు, అమరచింత

నెలలో రెండు చీరలు..



చేనేత ఉత్పత్తుల సంఘం ఏర్పాటుతో జీవనోపాధి దొరికింది. మాస్టర్ వీవర్స్ వద్ద చీర నేయడంతో వారం, పక్షం రోజులకో వేతనం అందించేవారు. ప్రస్తుతం సంఘం ఆధ్వర్యంలో నెలకు రెండు చీరలను అత్యంత నాణ్యతో తయారు చేయడంతో అధిక డబ్బులు వస్తున్నాయి. నెలలో రెండు చీరల తయారీతో రూ.20 వేల నుంచి రూ. 25 వేల వరకు వేతనంం పొందుతున్నా.

– స్వప్న, చేనేత కార్మికురాలు, అమరచింత

స్థలభావం లేదు..



ఇంట్లో మగ్గాల ఏర్పాటుకు సరిపడా స్థలాలు ఉండేవి కాదు. దీంతో కిరాయి ఇంట్లో ఉంటూ మగ్గాలు వేసుకొని చీరలు తయారు చేసేవాళ్లం. ప్రస్తుతం సంఘం ఆధ్వర్యంలో భవనం నిర్మించడం.. అందులోనే మగ్గాలను ఏర్పాటు చేయడంతో రోజు అక్కడికే వెళ్లి జరి చీరలను తయారు చేస్తూ భృతి పొందుతున్నాం.

– పద్మ, చేనేత కార్మికురాలు, అమరచింత

చేనేత అంతరించకుండా..



పుట్టి పెరిగిన ఊరిలో చేనేత కార్మికులు ఉపాధి కోల్పోతు ఉడటంతో సాటి చేనేత కార్మికుడిగా ఎంతో బాధపడ్డా. కార్మికులను యజమానులుగా చేయాలనుకున్నా. నాబార్డ్ వారిని సంప్రదించి సంఘం ఏర్పాటు చేశాను. నాడు 40 మందితో ప్రారంభమైన సంఘం నేడు 445 కార్మికులతో కొనసాగుతుంది. నెలసరి వేతనంతో పాటు వచ్చిన లాభం పంచుతూ కార్మికుల ఆర్థిక పురోగతికి కృషి చేస్తున్నా. కలెక్టర్ సహకారం, ఎమ్మెల్యే చొరవతో సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నా.

– మహంకాళి శేఖర్, సీఈఓ

వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..



పార్టీలో చేరిన వారితో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: తెలంగాణలో మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ పార్టీనే అని, ముఖ్యమంత్రి కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా రికార్డు సృష్టిస్తారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో పెబ్బేరు నాలుగోవార్డు కౌన్సిలర్ పార్వతి, ఆమె భర్త మహేందర్‌గౌడ్‌తో పాటు మరో 50 మంది పార్టీలో చేరగా మంత్రి వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజా ఆశీర్వాదం పుష్కలంగా ఉందన్నారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశంలోని మరే రాష్ట్రంలోనూ అమలు కావటం లేదని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు రాష్ట్రంలో చోటు లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, పార్టీ పట్టణ అధ్యక్షుడు దిలీప్‌కుమార్ రెడ్డి, నాయకులు సాయినాథ్, చిన్న ఎల్లారెడ్డి, గోపి బాబు, అక్కల జ్యోతి, సుమతి, శివశంకర్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, శోభారాణి, మమత, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నాగూరావు నామాజీ

బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు నాగూరావు నామాజీ

కొత్తకోట: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు నాగూరావు నామాజీ అన్నారు. ఆదివారం పట్టణంలోని కేపీఎస్ స్కూల్‌లోని రామకృష్ణ పరమహంస ఆడిటోరియంలో నిర్వహించిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రతి బూత్‌లో ఇంటింటికి వివరించాలన్నారు. కేంద్ర నిధులతో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి వివరిస్తూ బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎండగట్టాలని తెలిపారు. యువత బీజేపీ వైపు చూస్తున్నారని.. రానున్న ఎన్నికల్లో ఓట్లు వేసేలా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాలను మోసం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డా. రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డా. ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు, సుదర్శన్‌రెడ్డి, మాధవరెడ్డి, భరత్‌భూషణ్, మాధవరెడ్డి, మన్యం, శ్రీకాంత్‌రెడ్డి, రాఘవేంద్ర, నవీన్‌రెడ్డి, కొమ్ము సురేష్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశ రుద్రాభిషేకం

హాజరైన మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్మన్



పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ స్వర్ణమ్మ

ఆత్మకూర్: పట్టణంలోని సత్యసాయిబాబా మందిరంలో ఆదివారం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో భాగంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వేణుగోపాల్, తిప్పారెడ్డి, శ్యాంలాల్, నాగరాజు, అశోక్‌రావు, రవీందర్‌రెడ్డి, పుల్లయ్య, నర్సింహులు, నవీన్, రఘు, ముకేష్, రమేష్ పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి ఎదురుచూపులు



నిర్మాణం పూర్తయిన మహిళా పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ భవనం

- నిర్మాణం పూర్తయినా నిరుపయోగంగానే మహిళా పాలిటెక్నిక్ కళాశాల వసతిగృహం
- తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ హాస్టళ్లను ఆశ్రయిస్తున్న విద్యార్థినులు
- తల్లిదండ్రులకు ఆర్థిక భారం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

పెబ్బేరు రూరల్: పెబ్బేరులోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో హాస్టల్ వసతి లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2017లో అప్పటి విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ప్రస్తుత మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పట్టణంలో కళాశాలను ప్రారంభించారు. ప్రస్తుతం కళాశాలలో ఈఈఈ, ఈసీఈ కోర్సులు కొనసాగుతున్నాయి. దూరప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 100 విద్యార్థులు ఉండేందుకు రూ.3 కోట్లతో 2019లో హాస్టల్ భవనం నిర్మించారు. భవన నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా.. ప్రారంభానికి నోచుకోవడం లేదు. బెడ్లు, తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్, డైనింగ్ హాల్‌లో ఫర్నీచర్, ప్రహరీ, కంచె ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఏటా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తున్నారు. హాస్టల్ వసతి లేకపోవడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఎలాంటి అనుమతి లేని ప్రైవేట్ హాస్టల్స్‌లో ఉంచడంతో వసతి, రవాణా ఛార్జీలు ప్రతినెల రూ.5 వేల వరకు అదనపు భారం పడుతుంది.

అదనపు ఖర్చులు..



కళాశాలలో హాస్టల్ లేకపోవడంతో పట్టణంలోని ప్రవేట్ హాస్టల్‌లో ఉంటున్నాం. ప్రతి నెల రూ.5 వేల వరకు అదనపు భారమవుతుంది. కళాశాల ఆవరణలో హాస్టల్ భవన నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందిస్తే దూర ప్రాంతాల విద్యార్థులకు బాగుంటుంది.

– మౌనిక, ఈఈఈ రెండో సంవత్సరం

రాకపోకలకు ఇబ్బందులు..



కళాశాలకు వెళ్లాలంటే బస్సు లేదా ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. 44వ నంబర్ జాతీయ రహదారికి అనుసరించి కళాశాల ఉండటంతో సరీ్వస్ రోడ్డు లేక వాహనాల కోసం వేచి చూసే సమయంలో, రోడ్డు దాటేటప్పుడు ప్రమాదాలు జరుగుతాయని భయపడుతున్నాం.

– రోహిణి, ఈసీఈ, మూడో సంవత్సరం

త్వరలోనే ప్రారంభిస్తాం..



హాస్టల్ భవన నిర్మాణం పూర్తయిందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు తెలియజేశాం. త్వరలోనే ప్రారంభించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ వివరించారు. హాస్టల్ ప్రారంభిస్తే దూరప్రాంతాల నుంచి వచ్చిన 120 మంది విద్యార్థినుల ఇబ్బందులు తొలుగుతాయి.

– శ్రీకాంత్, ప్రిన్స్‌పాల్

అనారోగ్యంతో ఆర్‌ఏఎఫ్ కానిస్టేబుల్ మృతి

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

వనపర్తి: జిల్లాకేంద్రానికి చెందిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ బుచ్చన్న అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాకేంద్రంలోని జంగిడిపురంలో ఉంటున్న బుచ్చన్న (52) హాకీంపేటలోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుండేవాడు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం రాత్రి జంగిడిపురంలోని తన నివాసంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డీఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఇతర బెటాలియాన్ పోలీసులు ఆదివారం జిల్లాకేంద్రానికి చేరుకొని హిందూ శ్మశానవాటికలో అధికార లాంఛనలతో అంత్యక్రియలు నిర్వహించారు. గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి శ్రద్ధాంజలి ఘటించారు. వనపర్తి పట్టణ ఎస్‌ఐ యుగేంధర్రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అంత్యక్రియలకు భారీగా జనం తరలివచ్చారు. భార్య లక్ష్మీదేవి, కుటుంబీకుల రోదనలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి.

ఆచార్య.. నిను మరువలేం

అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు



ఆచార్య జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు, కలెక్టరేట్ సిబ్బంది

వనపర్తి: తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆచార్య జయశంకర్ సేవలు మరువలేమని అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు అన్నారు. ఆదివారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొని ఆచార్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆచార్య జయశంకర్ గొప్ప విద్యావేత్త అని, వరంగల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా పని చేస్తూ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. తెలంగాణ సాధించాక విప్లవాత్మకమైన అభివృద్ధి సాధించాలనే ఆకాంక్షతో వినూత్న కార్యక్రమాలకు పురుడు పోశారని గుర్తుచేశారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ రమేష్‌రెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రొ. జయశంకర్ స్ఫూర్తితోనే అభివృద్ధి



ప్రొ. జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గట్టుయాదవ్

వనపర్తిటౌన్: ప్రొ. జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రం అభివృద్ధి పథంలో పురోగమిస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ అన్నారు. ప్రొ. జయశంకర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం జిల్లాకేంద్రంలోని పుర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను లెక్కలతో సహా బయటపెట్టిన మేధావి జయశంకర్ అని కొనియాడారు. ఉద్యమ పార్టీ అయిన అధికార పార్టీకి సిద్ధాంతకర్తగా వ్యవహరించడం.. తెలంగాణ ఉద్యమాన్ని, భావజాలాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. తెలంగాణ సమాజం జయశంకర్‌ను ఎన్నటికీ మరువదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు భువనేశ్వరి, సత్యం సాగర్, నక్క రాములు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, నాయకులు స్టార్ రహీం, ఎల్‌ఐసీ కృష్ణ, పుర సిబ్బంది లక్ష్మణ్, బంకలి మన్యం, వెంకటస్వామి, చందు, శ్రీనివాసులు, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహబంధం గొప్పది..

అన్ని బంధాల కన్నా.. స్నేహబంధం గొప్పదని మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ అన్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా తన తోటి స్నేహితులైన ఆటో డ్రైవర్, ఇతర రంగాల్లో పని చేస్తున్న మిత్రులను ఆదివారం ఘనంగా సన్మానించి మాట్లాడారు. స్నేహం లేని జీవితం వ్యర్థమని.. స్నేహమనే బంధం దేవుడిచ్చిన వరమన్నారు. కార్యక్రమంలో స్నేహితులు స్టార్ రహీం, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొ. జయశంకర్



ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్నఎస్పీ రక్షిత కె.మూర్తి

వనపర్తి: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని ఎస్పీ రక్షిత కె.మూర్తి అన్నారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఆయన చూపిన ఉద్యమ స్ఫూర్తి ప్రశంసనీయమని కొనియాడారు. 1969 ఉద్యమంలో చురుగ్గా పాల్గొని తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి నాయకుడిగా ఫజల్‌అలీ కమీషన్‌కు నివేదిక అందజేశారని గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పుస్తకాలు రాయటం, దేశంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో ఎన్నో ప్రసంగాలు చేశారని వివరించారు. మేధావులు, కవులు, రచయితలు, ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తి సడలకుండా కృషిచేశారన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ మధుసూదన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బస్సు, డీసీఎం ఢీ ఒకరు దుర్మరణం


మహేష్ (ఫైల్)

పాన్‌గల్: ఆర్టీసీ బస్సు, డీసీఎం ఢీకొనడంతో డీసీఎం డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ వేణు కథనం ప్రకారం.. ఫర్టిలైజర్ లోడ్‌తో తెల్లరాళ్లపల్లికి వెళ్తున్న డీసీఎం వెంగళాయిపల్లి–కేతేపల్లి గ్రామాల మధ్య మలుపు వద్ద ఎదురుగా వనపర్తి వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. దీంతో డీసీఎం డ్రైవర్ మహేష్(25) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం డీసీఎంలో ఇరుక్కుపోవడంతో జేసీబీ సహాయంతో తీశారు. మహేష్‌ది నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పదర గ్రామంగా గుర్తించారు. బస్సులో మొత్తం 27 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు డ్రైవర్ తలకు బలమైన గాయమైంది. కండక్టర్‌తో పాటు పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. బస్సు కండక్టర్ యూసుఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మలుపుల వద్ద సూచిక బోర్డులు లేక ప్రమాదాలు జరుగుతున్నట్లు ప్రయాణికులు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మద్దూరు: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన ఆదివారం కొత్తపల్లి మండలం దుప్పట్‌గట్‌లో చేసుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. దుప్పట్‌గట్‌కు చెందిన మాడమోల చెన్నప్ప(62) తన పొలానికి నీళ్లు పెట్టడానికి బోరుమోటర్ ఆన్ చేశాడు. మోటర్ ఆన్ కాకపోవడంతో 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఫీజు వైరు వేయడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఏబీ స్విచ్ పనిచేయకపోవడంతో విద్యుత్ సరఫరా అయి షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయమై విద్యుత్ ఏఈ మహేష్‌కుమార్‌ను వివరణ కోరగా తమకు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేయబోయి విద్యుదాఘాతానికి గురైనట్లు పేర్కొన్నాడు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్య ఉన్నా స్తంభాలను ముట్టుకోవద్దని, సమస్యను విద్యుత్ సిబ్బంది దృష్టికి తేవాలన్నారు.

చికిత్సపొందుతూ యువకుడు..


సాయిబాబ(ఫైల్)

కల్వకుర్తిరూరల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని పంజుగులలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పంజుగులకు చెందిన సాయిబాబు(28)కు రెండు రోజుల క్రితం వెల్దండ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. మూడు మాసాల క్రితం సాయిబాబు తండ్రి బాలయ్య కల్వకుర్తి పరిధిలోని ఎల్లికల్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తండ్రీకొడుకులు రోడ్డు ప్రమాదాల్లో మరణించడం ఆ కుటుంబాన్ని తీవ్రంగా కలిచివేసింది. సాయిబాబకు ఏడాది క్రితం పెళ్లై భార్య తొమ్మిదినెలల కడుపుతో ఉంది. దీంతో గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.

పుల్లూర్‌లో మరో వ్యక్తి..

ఉండవెల్లి: భార్య తిట్టిందని పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం పుల్లూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ బాలరాజు కథనం ప్రకారం.. మండలంలోని పుల్లూరుకు చెందిన శ్యాంబాబు(48) లక్ష్మీదేవికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. కుమారుడు గతంలో మృతిచెందాడు. ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశారు. భార్య లక్ష్మీదేవి, కుమారుడు శివసాయి, కుమార్తె స్నేహతో కలిసి ఉన్నాడు. శ్యాంబాబు మద్యానికి బానిసై ఈ నెల 4వ తేదీన తాగి ఇంటికొచ్చాడు. భార్య గొడవ పడి, తాగొస్తే వ్యవసాయ పనులు ఎవరు చేస్తారని మందలించింది. దీంతో బయటికెళ్లి పురుగుల మందు తాగి వచ్చాడు. వాంతులు చేసుకోవడంతో భార్య పిల్లలు గమనించి వెంటనే చికిత్స కోసం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. అయన తమ్ముడు రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాముకాటుతో రైతు..


శివ (ఫైల్)

మరికల్: పొలంలో గుంటిక కొడుతుండగా పాముకాటు వేయడంతో రైతు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం పసుపులలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం.. పసుపులకు చెందిన ముష్టి శివ (45) పత్తి పంట పొలంలో కలుపు తీసేందుకు ఎద్దులతో గుంటిక కొడుతుండగా పాముకాటు వేసింది. దీంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం మరికల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడ పరిక్షించిన వైద్యులు శివ మృతి చెందినట్లు తెలిపారు. అతనికి భార్య, కొడుకు ఉన్నారు.

ఆర్‌ఓబీతో అష్టకష్టాలు


ఆర్వోబీ రోడ్డుతో దేవరకద్ర పట్టణ దృశ్యం

- రెండుగా చీలిన దేవరకద్ర పట్టణం
- మూతపడిన వ్యాపార కేంద్రాలు
- వెలవెల బోతున్న బస్టాండ్
- షెల్టర్ లేక రోడ్డుపైనే ప్రయాణికుల పాట్లు

దేవరకద్ర: పట్టణంలో ఆర్ఓబీ ప్రారంభమైతే ప్రజలకు ట్రాఫిక్ సమస్య తీరిందనే సంతోషం ఒక్కరోజు కూడా దక్కలేదు. ఆర్ఓబీ ప్రారంభమైన తర్వాత రైల్వే అధికారులు ఇనుప గేటు వేశారు. దీంతో ప్రజల కష్టాలు మొదలయ్యాయి. పాత బస్టాండ్, కొత్త బస్టాండ్‌లకు మధ్య గేట్ ఉండడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రోడ్డుకిరువైపుల వ్యాపార కేంద్రాలన్నీ మూతపడ్డాయి. ప్రభుత్వ దవాఖాన, పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్, పశువైద్యశాల, పలు కార్యాలయాలు, పశువుల సంత, కూరగాయల సంత పాతబస్టాండ్ వైపే ఉన్నాయి. కొత్త బస్టాండ్ వైపు మార్కెట్ కార్యాలయం, హోల్‌సేల్ వ్యాపారాలు, విద్యుత్ కార్యాలయం, బ్యాంకులు ఉన్నాయి. ఇలా పట్టణం రెండుగా చీలిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటునుంచి అటు, అటు నుంచి ఇటు తిరిగి రావడానికి మూడు కిలోమీటర్లు అవుతోంది. ప్రజలకు ఉపయోగపడని వంతెన తమకొద్దని, ఎప్పటిలాగే గేటును తెరిచి ఉంచాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ విషయంపై శ్రద్ధ తీసుకొని గేటు తెరిచేవిధంగా కృషి చేయాలని కోరుతున్నారు.

బస్టాండ్ వెలవెల..

దేవరకద్ర మీదుగా నిత్యం 400 బస్సులు రాకపోకలు సాగిస్తాయి. రాయిచూర్, నారాయణపేట, మక్తల్, ఆత్మకూర్ పట్టణాలకు ఎక్స్‌ప్రెస్‌లు పదుల సంఖ్యలో తిరుగుతుంటాయి. కర్ణాటక డిపోకు చెందిన బస్సులు సైతం ఈ పట్టణం గుండానే వెళ్తుంటాయి. హైదరాబాద్ వెళ్లే ప్రతి బస్సు కూడా దేవరకద్ర బస్టాండ్ టచ్ చేసే వెళ్లేవి. నిత్యం కలకళలాడే బస్టాండ్ ఇప్పుడు బస్సులు రాకపోవడంతో వెలవెలబోతోంది. ఆర్ఓబీ రెండు చివరల ప్రయాణికులు బస్సుల కోసం నిల్చుంటున్నారు. రోడ్డుపై చిన్నపిల్లలు, వృద్ధులు, బ్యాగులతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఏకధాటిగా కురుస్తున్నవర్షాలకు సైతం రోడ్డుపై తడుస్తూనే బస్సుల కోసం రోడ్డుపై వేచి ఉంటున్నారు. రెండు వైపుల తాత్కాలిక బస్ షెల్టర్ నిర్మిస్తామని అధికారులు చెప్పి నెల రోజులైనా ఆ ఊసే లేదు.

ప్రమాదకరంగా..

ఆర్ఓబీ నిర్మాణం పూర్తయ్యాక వాహనాల రాకపోకలు నడుస్తున్నాయి. వాహనాలు, పెద్దవాహనాలు యూటర్న్ తీసుకోవడానికి రోడ్డు వెడల్పు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ఓబీకి రెండు వైపుల సర్వీస్ రెడ్డు వెయాల్సి ఉండగా, ఒక వైపు మాత్రమే ఉంది. దీని వల్ల స్థానికులు తిరగడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


బస్సులు లేక వెల వెల బోతున్న దేవరకద్ర బస్టాండ్

అడ్డుగా ఉన్న కట్టడాలు తొలగించాలి..

అడ్డుగా ఉన్న కట్టడాలు తొలగిస్తేనే సర్వీసు రోడ్డు వేయడానికి సాధ్యమవుతుంది. సంత బజార్ వైపు, పాత గ్రామ పంచాయతీ వరకు దేవాలయం కమాన్, ఇతర కట్టడాలు ఉన్నాయి. వాటిని తొలగిస్తే కాంట్రాక్టర్ సర్వీసు రోడ్డు వేయడానికి సిద్ధంగా ఉన్నాడు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో టాకీస్ వైపు రోడ్డు స్థలం ఇరుకుగా ఉండడం వల్ల చిన్నగా సర్వీసు రోడ్డు వేయడానికి అవకాశముంది.

– కౌషిక్, ఏఈ ఆర్అండ్‌బీ

షెల్టర్ల నిర్మాణానికి ఎస్టిమేట్ పంపించాం..

దేవరకద్ర ఆర్ఓబీకి రెండు వైపుల తాత్కాలిక బస్ షెల్టర్ల నిర్మాణం కోసం ఎస్టిమేట్ వేసి పంపించాం. దీనికి ఎమ్మెల్యే నిధులు ఖర్చు చేయడానికి ఒప్పుకున్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తాం. అనువైన చోట శాశ్వత బస్టాండ్ నిర్మించేందుకు రాష్ట్ర అధికారులు నిర్ణయం తీసుకుంటారు.

– సుజాత, డీఎం, మహబూబ్‌నగర్

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో


జూరాలలో ప్రస్తుత నీటిమట్టం

- ఎగువ నుంచి 39 వేల క్యూసెక్కుల వరద
- జెన్‌కోలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు/ దేవరకద్ర/ దోమలపెంట/ ఆత్మకూర్/ : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతోంది. ఆదివారం రాత్రి 8 గంటలకు 39 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్లను కొనసాగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఇందుకోసం 35,083 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. నెట్టెంపాడు రెండు పంపుల ద్వారా 1,500 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–1కు 650, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వకు 730 కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 39,821 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలానికి వదలగా.. 88 క్యూసెక్కులు ఆవిరైంది. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.627 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువనున్న ఆల్మట్టి ప్రాజెక్టుకు ప్రస్తుతం 70 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అదే స్థాయిలో దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 129.72 టీఎంసీలు కాగా.. 121.606 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 70 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువకు 67,900 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 31.01 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పెరుగుతున్న నీటిమట్టం..

కోయిల్‌సాగర్‌లో నీటిమట్టం రోజురోజుకు పెరుగుతుంది. ఆదివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులో 27 అడుగులకు చేరింది. పాత అలుగు స్థాయి 26.6 అడుగు కాగా.. గేట్ల స్థాయి నీటిమట్టం 32.6 అడుగులు. మరో 5.6 అడుగుల నీరు చేరితే గేట్లను తెరిచే అవకాశం ఉంది. జూరాల బ్యాక్‌వాటర్ ఉంద్యాల ఫేజ్–1 పంపుహౌస్ నుంచి ఒక మోటార్ ద్వారా 315 క్యూసెక్కుల నీటిని కోయిల్‌సాగర్‌కు విడుదల చేస్తున్నారు. వానాకాలం పంటలకు, గొలుసుకట్టు చెరువులను నింపడానికి కుడి, ఎడమ కాల్వల ద్వారా 240 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

శ్రీశైలంలో 861.2 అడుగులు

ఎగువనున్న జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,837 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో భూగర్భ కేంద్రంలో 4.317 మి.యూ., విద్యుదుత్పత్తి చేసి 8,502 క్యూసెక్కుల నీటిని దిగువనున్న నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. జలాశయంలో 296 క్యూసెక్కుల నీరు ఆవిరి కాగా.. ప్రస్తుతం 861.2 అడుగుల వద్ద 109.8070 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

వేగవంతంగా విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. ఆదివారం 12 యూనిట్లకు గాను, 11 యూనిట్ల ద్వారా 433 మెగావాట్లు విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు ఉత్పత్తి చేశామన్నారు. ఆయా జల విద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 96.350 మి.యూ., ఉత్పత్తి చేపట్టామని, వివరించారు.

నీటి పంపింగ్ ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

మరికల్: జూరాల బ్యాక్‌వాటర్ నుంచి కోయిల్‌సాగర్ ప్రాజెక్టు వదర నీటి పంపింగ్ ప్రారంభమైంది. జూరాల నుంచి కోయిల్‌సాగర్ ప్రాజెక్టును నింపాలని ఈ నెల 3న 'సాక్షి'లో 'ఎత్తిపోతల ఎప్పటికో' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆదివారం తీలేర్ పంపుహౌజ్ దగ్గర మోటార్లను ప్రారంభించి కోయిల్‌సాగర్‌కు నీటిని విడుదల చేశారు. దీంతోపాటు డిస్ట్రిబ్యూటరీ–16కు సైతం నీళ్లు వదలడంతో రైతులు వరినాట్లకు సిద్ధమవుతున్నారు.


తీలేర్ పంపుహౌజ్ దగ్గర నీటిని ఎత్తిపోస్తున్న మోటార్లు

వేర్వేరుచోట్ల నలుగురి బలవన్మరణం

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల వివిధ కారణాలతో బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా..


లక్ష్మి (ఫైల్)

దామరగిద్ద: మానసిక స్థితి సరిగా లేని ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్ఐ గోవర్ధన్ కథనం ప్రకారం.. నారాయణపేట మండలం బండగొండకు చెందిన లక్ష్మి(30)కి దేశాయ్‌పల్లికి చెందిన నంబి హన్మంతుతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు ఆడబిడ్డలున్నారు. అయితే లక్ష్మి మానసిక స్థితి సరిగా లేక శనివారం ఇంటో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయమై లక్ష్మి తల్లి చంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తి..

ఉప్పునుంతల: మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలోని మొల్గరలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తోళ్ల లింగమయ్య(46) ఆదివారం మధ్యాహ్నం మద్యం తాగొచ్చి భార్యతో గొడవపడ్డాడు. తర్వాత ఇంట్లో ఎవరూ లేనిసమయంలో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్ది సేపటికి భార్య ఇంటికొచ్చి చూడగా భర్త మృతదేహం వేలాడు కనిపించింది. వెంటనే చుట్టుపక్కల వారిని పిలిచి కిందికి దింపి చూడగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. లింగమయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మనస్తాపంతో యువకుడు..


గణేష్ (ఫైల్)

తెలకపల్లి: భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండలంలోని పెద్దపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సంతోష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బోయ గణేష్(25) ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొద్దిరోజుల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన గణేష్ ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై గణేష్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యతో గొడవపడి ఆర్టీసీ డ్రైవర్..


శ్రీనివాసులు (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: భార్యతో గొడవపడిన ఓ ఆర్టీసీ డ్రైవర్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ మహేందర్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులో నివాసముంటున్న శ్రీనివాసులు(45) నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధులు ముగించుకుని ఆదివారం జిల్లాకేంద్రానికి వచ్చాడు. ఇంట్లో మద్యం తాగుతుండగా భార్య మందలించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. భార్య, కుమారుడు బయటకు వెళ్లగా సాయంత్రం ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వారు వచ్చి చూడగా ఫ్యాన్‌కు శ్రీనివాసులు మృతదేహం కనిపించింది. వెంటనే జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై భార్య ఎల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంట్లో చోరీ


ఇంట్లో చిందరవందరగా పడున్న వస్తువులు

కల్వకుర్తి టౌన్: ఇంటికి తాళం వేసి బంధువులను చూడటానికి వెళ్లిన ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ చేసిన ఘటన పట్టణంలోని కళ్యాణ్‌నగర్ కాలనీలో చోటుచేసుకుంది. ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.. పట్టణంలోని కళ్యాణ్‌నగర్ కాలనీలో నివాసముండే వసంతం తన బంధువులను చూడటానికి జడ్చర్ల మండలం చిన్న ఆదిరాలకు శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి ఆదివారం ఉదయం ఇంటికొచ్చి చూడగా ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడున్నాయి. ఇంట్లో 2 తులాల బంగారం, 20తులాల వెండి, రూ.60వేల నగదు చోరీకి గురైనట్లు వసంతం పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు క్లూస్‌టీంతో ఘటనా స్థలానికి చేరుకొని క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

జడ్చర్ల: వ్యక్తి అదృశ్యమైన ఘటన జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ రమేష్‌బాబు కథనం ప్రకారం.. మండల పరిధిలోని కిష్టంపల్లికి చెందిన ఆంజనేయులుగౌడ్ (36) ఈ నెల 2వ తేదీ నుంచి కనిపించడం లేదని భార్య లావణ్య ఆదివారం జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. పని ఉందని 2వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన ఆంజనేయులుగౌడ్ తిరిగి రాలేదు. బంధువుల దగ్గర, తెలిసిన వారి దగ్గర వెతికినా అతని ఆచూకీ కనిపించలేదు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ అయినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళకు గాయాలు

మక్తల్: ఇటీవల కురిసిన వర్షాలకు ఇంటిపైకప్పు పెచ్చులూడి మహిళకు గాయాలైన ఘటన ఆదివారం మండలం పస్పులలో చోటుచేసుకుంది. ఈ విషయం తెలిసిన వెంటనే సర్పంచ్ దత్తు, పంచాయతీ కార్యదర్శి అరుణజ్యోతి ఇంటిని పరిశీలించారు. ఇల్లు శిథిలావస్థకు చేరిందని, ఇంట్లో నివాసం ఉండొద్దని గాయాలైన లక్ష్మమ్మకు సూచించారు.

చిరుత గోర్లు అమ్మేందుకు యత్నం

- నల్లమలలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న అటవీ అధికారులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎఫ్ఓ రోహిత్ తదితరులు

సాక్షి, నాగర్‌కర్నూల్/ మన్ననూర్: నల్లమల అటవీ ప్రాంతంలోని సోమచెల్క బీట్ పరిధిలో మృతిచెందిన చిరుత నుంచి కాలిగోరు, దంతాలు సేకరించి, వాటిని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం కుమ్మరోనిపల్లిలో చోటుచేసుకుంది. ఆదివారం మన్ననూర్‌లోని అటవీ శాఖ కార్యాలయంలో జిల్లా అటవీ శాఖాధికారి రోహిత్ గోపిడి ఘటన వివరాలను మీడియాకు వివరించారు. ఈ నెల 4న అమ్రాబాద్ మండలం కుమ్మరోనిపల్లి రైతువేదిక సమీపంలో కొందరు వ్యక్తులు చిరుత నుంచి సేకరించిన ఒక గోరు, రెండు కోరపళ్లను అమ్ముతుండగా, సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు వారిని పట్టుకున్నారు. వీరిలో పదర మండలం మద్దిమడుగుకు చెందిన ఉపసర్పంచ్ బోయిన చిన్నఆంజనేయులు, గ్రామ పంచాయతీ వర్కర్ గుర్రం ఆంజనేయులు, ఇప్పలపల్లికి చెందిన రాట్లావత్ నరేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. మరోవ్యక్తి మండ్ల చిన్న ఈదయ్య పరారీలో ఉన్నాడని చెప్పారు. సుమారు నాలుగు నెలల కిందట నల్లమలలో మద్దిమడుగు రేంజ్‌లోని సోమచెల్క బీట్ క్యాంపు 139 సెక్షన్ వద్ద చిరుతపులి మరణించి ఉండగా.. దాని కళేబరం నుంచి గోరు, దంతాలను నిందితులు సేకరించినట్లు వివరించారు. చిరుత సహజంగా మరణించినట్లు ప్రాథమికంగా నిర్ధారించామని, ఫోరెన్సిక్ రిపోర్టు వచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయని వెల్లడించారు. సమావేశంలో అమ్రాబాద్ ఎఫ్‌డీఓ విశాల్, ఎఫ్ఆర్ఓలు ఆదిత్య, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'పేట' క్రీడాకారులు

నారాయణపేట రూరల్: జాతీయ జువెలిన్ డేను పురస్కరించుకుని సోమవారం హన్మకొండలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి క్రీడాకారులు తరలివెళ్లారు. ఈనెల 1న మినీ స్టేడియంలో నిర్వహించిన జావెలిన్ త్రో జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈమేరకు ఆదివారం ఆ బృందం సభ్యులను అభినందించి హన్మకొండకు తరలించారు. గట్టి పోటీ ఇచ్చి పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ నాయకులు రమణ, అమరీష్, కోచ్ గణేష్, అనురాధ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న క్రీడాకారులు

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సెంట్రల్ కమిటీ తనిఖీ


పరిశీలిస్తున్న కేంద్ర కమిటీ సభ్యులు

గండేడ్: మండల కేంద్రంలో సెంట్రల్ టీం సభ్యుడు లోకేష్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో వసతులపై ఆరా తీసి, అభివృద్ధి ఏ మేర జరిగిందో పరిశీలించారు. 15 ఇళ్లకు వెళ్లి పూర్తి స్థాయి వివరాలు సేకరించారు. బాత్‌రూంలు, వాటికి డోర్లు ఉన్నాయా? వినియోగంలో ఉన్నాయా? లేవా అనే విషయాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్ గార్డెన్లు పరిశీలించారు. వంటగది నుంచి వెళ్లే నీటిని డ్రైనేజీలోకి వదల కుండా పెరటి తోటలు పెంచాలన్నది తమ లక్ష్యంగా పేర్కొన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ వ్యవస్థ ఎలా ఉందో వార్డుల్లో పరిశీలించారు. ప్రజారోగ్యంపై ఇంటింటికి వెళ్లి ప్రజలతో మా ట్లాడి వివరాలు సేకరించారు. కేంద్ర కమి టీ సభ్యులతో పాటు జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్యగౌడ్, ఎంపీడీఓ రూపేందర్ రెడ్డి, ఎంపీఈఓ శంకర్‌నాయక్, ఏపీఓ హరిశ్చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నిబద్ధతతో పనిచేస్తే అత్యున్నత స్థాయికి

ఆత్మీయ సన్మానసభలో హైకోర్టు రిటైర్డు ప్రధాన న్యాయమూర్తి నవీన్‌రావు



జస్టిస్ నవీన్‌రావును సన్మానిస్తున్న దృశ్యం

ధర్మారం(ధర్మపురి): నిబద్ధతతో పనిచేస్తే అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని హైకోర్టు రిటైర్డు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పాను గోటి నవీన్‌రావు అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన జస్టిస్ నవీన్‌రావు, జిల్లా కోర్టు రిటైర్డు పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరిశంకర్‌రావును ఆదివారం రైతువేదిక సమావేశ హాల్‌లో హైకోర్టు ఏజీపీ సాయిరాం మున్నా ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆత్మీయ పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ నవీన్‌రావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తాము ఎంచుకున్న రంగాల్లో కష్టపడి ఎదిగి అత్యుత్తమ స్థానంలో నిలవాలని ఉద్బోధించారు. నంది మేడారం రిజర్వాయర్ టూరిజం అభివృద్ధికి, మేడారం శివారు ప్రాంతంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు తన వంతు ప్రయత్నాలు చేస్తానని తెలిపారు. మేడారంలో జూనియర్ సివిల్ జడ్జి– జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు భవన నిర్మాణానికి తన వంతు సహకరిస్తానని హామీనిచ్చారు.

సీఎంకు పీఆర్టీయూటీఎస్ నేతల కృతజ్ఞతలు



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న పీఆర్టీయూటీఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో పీఆర్సీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి అసెంబ్లీలో స్పష్టం చేయడం పట్ల ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్, తెలంగాణ (పీఆర్టీయూటీఎస్) నేతలు హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

మిగులు నుంచి లోటుకు..

▶ మొదటి పేజీ తరువాయి

గణాంకాలను వెల్లడించింది. అయితే ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వివిధ ప్రభుత్వ శాఖల ఆర్థిక పారదర్శకతపై ఆడిట్ నిర్వహించి కాగ్ రూపొందించిన నివేదిక అందుబాటులో ఉన్నప్పటికీ ప్రభుత్వం సభ ముందుంచకపోవడం గమనార్హం.

2021–22 అకౌంట్ల నిర్వహణలో కాగ్ గుర్తించిన ముఖ్యాంశాలు

- 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి అడ్వాన్సులు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో కనీస నగదు నిల్వ ఉంచింది 76 రోజులు. స్పెషల్ డ్రాయింగ్ సౌకర్యం (ఎస్‌డీఎఫ్) వినియోగించుకుంది 30 రోజులు. వేజ్ అండ్ మీన్స్‌కు వెళ్లింది 159 రోజులు. ఓవర్ డ్రాఫ్ట్‌కు వెళ్లింది 100 రోజులు.
- అడ్వాన్సులు తీసుకున్న 289 రోజుల్లో (ఎస్‌డీఎఫ్ 30, వేజ్ అండ్ మీన్స్ 159, ఓడీ 100 రోజులు కలిపి) ఎస్‌డీఎఫ్ కింద రూ.9,636 కోట్లు, వేజ్ అండ్ మీన్స్ అడ్వాన్సుల రూపంలో రూ.34,969 కోట్లు వినియోగించుకుంది. ఓడీ కింద రూ.22,669 కోట్లు తెచ్చుకుంది.
- 2021–22 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అప్పుల రూపంలో తెచ్చిన రూ.42,936 కోట్లు, ప్రజాపద్దు కింద వినియోగించాల్సిన రూ.3,773 కోట్లను ద్రవ్యలోటు కింద చూపెట్టారు.
- ఆర్థిక జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ చట్టం (ఎఫ్ఆర్‌బీఎం) కింద 2021–22 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం మూడు లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఇందులో రెవెన్యూ మిగులుతో ఖజానా నిర్వహించాలనేది మొదటి లక్ష్యం కాగా, రూ.9,335 కోట్లు రెవెన్యూ లోటు ఏర్పడింది. జీఎస్‌డీపీలో 3 శాతానికి మించకుండా ద్రవ్యలోటు ఉండాలనేది రెండో లక్ష్యం కాగా, అది 4.06 శాతంగా నమోదైంది. నికర అప్పులు జీఎస్‌డీపీలో 25 శాతం మించవద్దనే మూడో లక్ష్యం కూడా నెరవేరలేదు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి జీఎస్‌డీపీలో 27.40 శాతం అప్పులు మిగిలాయి.
- రెవెన్యూ రాబడుల కింద వచ్చిన రూ.1,27,468 కోట్లలో దాదాపు 50 శాతం అనివార్య వ్యయం కిందనే ఖర్చు పెట్టాల్సి వచ్చింది. ఇందులో రూ.30,375 కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలకు, రూ.19,161 కోట్లు వడ్డీ చెల్లింపులు, రూ.14,025 కోట్లు పింఛన్ల కింద ఖర్చు పెట్టారు.
- ఏప్రిల్ 1, 2021 నాటికి రాష్ట్ర ప్రభుత్వ నికర అప్పులు రూ.2,78,017.64 కోట్లు. ఆ ఏడాదిలో తీసుకున్న అప్పులు రూ.43,593.94 కోట్లు. 2022 మార్చి 31 నాటికి నికర అప్పులు రూ.3,21,611.58 కోట్లు.
- పలు కార్పొరేషన్లు, సంస్థలకు రుణాలు తీసుకునేందుకు గాను రూ.40,449 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం గార్యంటీ ఇచ్చింది. దీంతో 2022 మార్చి 31 నాటికి ప్రభుత్వ నికర గ్యారంటీల మొత్తం రూ.1,35,283 కోట్లకు చేరింది.
- మొత్తం అప్పుల్లో రూ.28,883 కోట్లు మూలధన వ్యయం కింద, రూ.8,469 కోట్లు రుణాలు, అడ్వాన్సుల చెల్లింపులకు వెచ్చించారు. జీఎస్‌డీపీకి సమాంతరంగా మూలధన వ్యయం లేదు. జీఎస్‌డీపీలో 2.51 శాతం మాత్రమే మూలధన పద్దు కింద వెచ్చించారు.
- వివిధ మేజర్ పద్దులను ఆడిట్ చేయగా, ఉండాల్సిన నగదు నిల్వ కంటే తక్కువ ఉంది.
- 2021–22 ఆర్థిక సంవత్సరంలో వివిధ ప్రభుత్వ పథకాల అమలుకు గాను కేంద్రం నేరుగా ఇచ్చిన రూ.18,392 కోట్లు ప్రభుత్వ అకౌంట్లలో కనిపించలేదు. తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ లిమిటెడ్, తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లకు పలు పథకాల అమలు కోసం ఈ నిధులను కేంద్రం ఇచ్చింది.
- హౌసింగ్, పరిశ్రమల శాఖలకు బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం కంటే చాలా తక్కువ ఖర్చు పెట్టారు. బడ్జెట్ అంచనాల రూపకల్పనలో ఆయా శాఖలకు స్పష్టత లేని కారణంగానే ఇది జరిగింది.
- ఇక ప్రభుత్వ ఉద్యోగుల నుంచి కంట్రిబ్యూటరీ పింఛన్ పథకం కోసం ప్రతి నెలా వసూలు చేసే మొత్తంలో రూ.2,074.22 కోట్లు మాత్రమే నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్)కు జమ చేసింది. మరో రూ.313.72 కోట్లు జమ చేయాల్సి ఉంది.

వివిధ స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు 2021–22లో విడుదల చేసిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ వివరాలు

సంస్థ	గ్రాంట్ ఇన్ ఎయిడ్ (రూ.కోట్లలో)
జిల్లా పరిషత్‌లు	4,615.15
పంచాయతీ సమితులు	1,137.38
గ్రామ పంచాయతీలు	2,768.15
మున్సిపల్ కార్పొరేషన్లు	685.79
మున్సిపాలిటీలు	1,010.18
చట్టబద్ధ కార్పొరేషన్లు	3,369.57
యూనివర్సిటీలు	1,031.76
అభివృద్ధి సంస్థలు	355.47
సహకార సంస్థలు	166.94
ఎన్జీవోలు	599.61
ఇతర సంస్థలు	43,327.03

(ఈ ఏడాదిలో మొత్తం రూ. 61,399.70 కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో వివిధ సంస్థలకు ఇవ్వగా, అందులో రాష్ట్ర నిధులు రూ. 58,630.60 కోట్లు కాగా, కేంద్రం ఇచ్చిన నిధులు రూ. 2,769.10 కోట్లు)

బడ్జెట్ కన్నా అధికంగా, తక్కువగా వ్యయం (రూ.కోట్లలో) చేసిన శాఖల వివరాలు

అధిక వ్యయం చేసిన శాఖలు

శాఖ	బడ్జెట్ కేటాయింపు	ఖర్చు	తేడా శాతం
వైద్య, ఆరోగ్యం	381	509	34
పంచాయతీరాజ్	5,167	5,734	11
సాగునీటి శాఖ	11,490	12,071	5

తక్కువ ఖర్చు చేసిన శాఖలు

శాఖ	బడ్జెట్ కేటాయింపు	ఖర్చు	తేడా శాతం
హౌసింగ్	7,222	252	97
పరిశ్రమలు	1,686	286	83
పౌరసరఫరాలు	1,584	548	65
పురపాలక శాఖ	8,617	3,461	60

ప్రొఫెసర్ జయశంకర్‌కు సీఎం కేసీఆర్ నివాళి

- అసెంబ్లీహాల్‌లో జయశంకర్ చిత్రపటానికి మంత్రుల నివాళి
- జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా పాలన: కేటీఆర్



దివంగత ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: దివంగత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా అసెంబ్లీహాల్‌లోని ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నివాళులర్పించారు. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌తో పాటు మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, నిరంజన్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, చీఫ్‌విప్ దాస్యం వినయ భాస్కర్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు, పలువురు ఎమ్మెల్యేలు జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. శాసన మండలి ప్రాంగణంలో జయశంకర్ చిత్రపటానికి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ, చీఫ్‌విప్ భానుప్రసాదరావుతో పాటు పలువురు ఎమ్మెల్సీలు నివాళులర్పించినవారిలో ఉన్నారు. జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని మంత్రి కేటీ రామారావు అన్నారు. జయశంకర్ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి కేటీఆర్ పార్టీ నేతలతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ పాత్రను నేతలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో పాటు పలు కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

మంత్రుల నివాస సముదాయంలో

జయశంకర్ జయంతి సందర్భంగా మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆయన చిత్రపటం వద్ద రాష్ట్ర రోడ్లు భవనాలు, శాసనసభ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నివాళి అర్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ తన జీవిత కాలం తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం కృషి చేశారన్నారు.

ఎస్సై ఫలితాల వెల్లడి

- 587 ఉద్యోగాలకు 434 మంది పురుషులు, మహిళలు 153 మంది ఎంపిక
- నేడు వెబ్‌సైట్‌లో తుది ఎంపిక అభ్యర్థుల జాబితా
- నియామక బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: పోలీసు ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా వివిధ విభాగాల్లో ఎస్సై, ఏఎస్సై పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి ఆదివారం విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థుల జాబితా పోలీస్ నియామక మండలి వెబ్‌సైట్‌లో సోమవారం ఉదయం నుంచి అందుబాటులో ఉండనుంది. ఈ మేరకు పోలీసు నియామక మండలి చైర్మన్ వి.వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. వివిధ విభాగాలకు చెందిన 587 ఉద్యోగాలకు 434 మంది పురుషులు, 153 మంది మహిళల్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎస్సై,ఏఎస్సై పోస్టులకు సోమవారం నుంచి టీఎస్ఎల్‌పీఆర్‌బీ వెబ్‌సైట్‌లో కటాఫ్ మార్కుల కేటాయింపు, అభ్యర్థుల జన్మతేదీ వంటి వివరాలు వెల్లడిస్తామన్నారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు ఆగస్టు 9 నుంచి 11 వరకు ఆన్‌లైన్‌లో ప్రత్యేక ఫార్మాట్‌లో వారిపై ఉన్న కేసులు, మెడికల్ అంశాల వివరాలు అటెస్టేషన్ చేయించాలని సూచించారు. అటెస్టేషన్ కాపీని ఏ4 సైజులో ప్రింట్ తీసి, వాటిపై పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు అంటించి మూడు కాపీల్లో గెజిటెడ్ అధికారితో సంతకాలు చేయించి వాటిని సూచించిన కేంద్రాల్లో ఆగస్టు 14 నాటికి అందజేయాలని పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియలో సందేహాల నివృత్తికి సైతం నియామక మండలి అవకాశం కల్పించింది. ఆగస్టు 7వ తేదీ నుంచి 9 వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో సందేహాలు నివృత్తికి అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకు ఎస్సీ, ఎస్టీలకు రూ.2వేలు, ఇతరులకు రూ.3వేలు ఆన్‌లైన్‌లో చెల్లించాలని బోర్డు అధికారులు పేర్కొన్నారు.

‘మత్స్యకారులంటే రాహుల్‌కు ప్రేమ’



మాణిక్ రావ్ ఠాక్రేకు జ్ఞాపికను ఇస్తున్న ఫెర్నాండో, సాయికుమార్. చిత్రంలో పొన్నాల, యాష్కీ


సాక్షి, హైదరాబాద్: చేపలు పట్టే సృజనాత్మకత కలిగిన మత్స్యకారులంటే ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి ప్రేమ అని జాతీయ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ చైర్మన్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఫెర్నాండో అన్నారు. మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. టీపీసీసీ ఫిషర్‌మెన్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం చైర్మన్ మెట్టు సాయికుమార్ అధ్యక్షతన ఆదివారం గాంధీభవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రోహిణ్ రెడ్డి, శత్రులతో పాటు ఫిషర్‌మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఫెర్నాండో మాట్లాడుతూ రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారుల సమస్యల పరిష్కారంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేస్తామని హామీఇచ్చారు.

‘మున్సిపాలిటీకి శఠగోపం’పై.. మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు



జడ్చర్ల: మున్సిపాలిటీలో ట్రేడ్ లైసెన్సులు తీసుకోకుండా, ఎలాంటి పన్ను చెల్లించకుండా రూ.లక్షల్లో వ్యాపారులపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌కు ట్విటర్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఆదివారం ‘మున్సిపాలిటీకి శఠగోపం’ శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనం స్థానికంగా చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలో పలువురు దీనిపై చర్చించారు. అధికారులు, పాలకులు దీనిపై స్పందించి చట్టపరంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ మహిళా మోర్చ నాయకురాలు సాహితి ‘సాక్షి’ కథనంతో సంబంధిత మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు ట్విటర్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పన్నుల ఎగవేతకు పాల్పడిన వ్యాపారులపై కఠినంగా వ్యవహరించి ప్రభుత్వ ఆదాయాన్ని రాబట్టాలని కోరారు.

ప్రేక్షకుల విజయం ఇది



గద్వాల క్రైం: ‘మిస్టేక్’ సినిమాను విజయవంతంగా ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆ సినిమా డైరెక్టర్ భరత్ కొమ్మాలపాటి (సన్నీ)అన్నారు. ఆదివారం గద్వాల పట్టణంలోని ఎస్వీసీ సినిమా హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏఎస్‌పీ మీడియా హౌస్ నిర్మాణ సంస్థలో తీసిన సినిమాకు తొలిరోజే మంచి టాక్ వచ్చిందన్నారు. మూడు జంటలు ఓ చిన్న పొరపాటు వల్ల జరిగిన తప్పిదాలపై తీసిన సినిమా అన్నారు. రెండు గంటలపాటు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగుతుందని, వారికి ఎదురైన సంఘటనలు ప్రేక్షకులను కట్టిపడేసిందన్నారు. సినిమా అంతా అడవిలో సాగిందన్నారు. సరదాగా సాగుతూ వినోదాన్ని పంచుతుందన్నారు. గద్వాలకు అల్లుడుగా ఇక్కడి ప్రజలకు తాను సుపరిచితుడినని అన్నా రు. నిర్మాణ విలువల విషయంలో ఎక్కడా రాజీపడకుండా నిర్మాత అందించిన భరోసా మరువలేనిదన్నారు. ప్రేక్షకుల మధ్య సినిమా చూడడం, వారి కేకలతో తాను ప్రేక్షకుడిగా ఉండడం ఆనందంగా ఉందన్నారు. ఈ సినిమాను ఆదరించాలని కోరారు. సినిమాలో అంతా కొ త్త వారే నటించారని, మ్యూజిక్ డైరెక్టర్, సాంకేతిక నిపుణులు ఎంతో ప్రాణం పెట్టారన్నా రు. అనంతరం గద్వాల జై డ్యాన్స్ స్టార్ అకా డమీ మాస్టర్ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో డైరెక్టర్‌ను గజమాలతో సంత్కరించారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ



జిల్లా కేంద్రంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్‌లు

- ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఉమ్మడి జిల్లా ఎన్‌సీసీ క్యాంపు
- 21 విద్యాసంస్థల నుంచి 600 మంది విద్యార్థులు హాజరు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఎన్‌సీసీ (నేషనల్ క్యాడెట్ కార్ప్స్) ఎంతో కీలకంగా వ్యవహరిస్తోంది. పాఠశాల స్థాయిలో ప్రారంభమైన ఎన్‌సీసీ శిక్షణ డిగ్రీ వరకు కొనసాగుతుంది. ఈ క్రమంలో వారికి అనేక దశల్లో శిక్షణ ఇస్తారు. ఈ క్రమంలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ప్రారంభమైంది. ఈనెల 1 నుంచి 10వ తేదీ వరకు కొనసాగుతున్నది. శిక్షణలో భాగంగా విద్యార్థులు పలు అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో శిక్షణ 1973లో ప్రారంభం కాగా, ప్రతి ఏడాది విద్యాసంస్థల్లో విద్యార్థులు పెరుగుతున్నారు. శిక్షణ పూర్తయ్యాక క్యాడెట్ సీనియార్టీ ఆధారంగా పరీక్ష నిర్వహించి ఏ, బీ, సీ వంటి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. ఈ సర్టిఫికెట్ల ఆధారంగా అడ్మిషన్లు, ఉద్యోగాలలో ప్రధాన్యత కల్పిస్తారు. ఈ నేపథ్యంలో ఎన్‌సీసీలో చేరేందుకు విద్యార్థులు ఎంతో శ్రద్ధ చూపుతున్నారు.

600 మంది హాజరు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 21 విద్యాసంస్థల నుంచి 600 మంది విద్యార్థులు శిక్షణకు హాజరయ్యారు. ఇందులో 8 కళాశాలల నుంచి 250 మంది హాజరుకాగా, మరో 13 పాఠశాలల నుంచి 350 మంది హాజరయ్యారు. 21 విద్యాసంస్థల్లో 3200 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఉండగా వారిలో సీనియార్టీ ప్రకారం ఎంపిక చేసి శిక్షణకు పిలుస్తారు. 10 రోజుల పాటు క్యాడెట్లకు ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో వసతి, శిక్షణ ఏర్పాటు చేశారు.

వివిధ అంశాలపై శిక్షణ..

10 రోజుల పాటు జరిగే క్యాంపులో విద్యార్థులకు పలు అంశాలపై పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తారు. క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తారు. ఎన్‌సీసీలో ప్రధానమైన డ్రిల్, వెపన్ ట్రెనింగ్, ఫారెస్ట్‌లో మ్యాప్‌రీడింగ్, వివిధ క్రీడలపై శిక్షణ ఉంటుంది. వెపన్ ట్రెనింగ్‌లో భాగంగా జైభవాని సాగర్ అడవుల్లో క్యాడెట్‌లకు శిక్షణ కొనసాగుతోంది.

ప్రత్యేక రిజర్వేషన్లు..

ఎన్‌సీసీలో శిక్షణ పొంది సీ సర్టిఫికెట్ ఉన్న క్యాడెట్లకు ఇండియన్ మిలిటరీ అకాడమీలో 100 సీట్లు రిజర్వు చేసి ఉంటాయి. ఆఫీసర్స్ అకాడమీ చెన్నైలో 64 సీట్లు ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో క్యాడెట్లకు పరీక్ష లేకుండా నేరుగా ఇంటర్వ్యూ ద్వారా ఉద్యోగాల్లో నియమించేందుకు అవకాశం ఉంది. ఆర్మీ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుంటే పరీక్ష లేకుండానే శారీరక పరీక్ష ద్వారా నేరుగా ఉద్యోగం ఇస్తారు. పోటీ పరీక్షల్లో ఏ సర్టిఫికెట్ ఉన్న వారికి 2 మార్కులు, బీ సర్టిఫికెట్ ఉన్న వారికి 5 మార్కులు, సీ ఉన్న వారికి 10 మార్కులు అదనంగా ఇస్తారు. దీంతో ఎన్‌సీసీకి డిమాండ్ ఏర్పడింది.

విద్యార్థులకు మంచి భవిష్యత్..



శిక్షణలో భాగంగా విద్యార్థులకు డ్రిల్, ఫైరింగ్, తదితర శిక్షణతో పాటు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు నిర్వహిస్తాం. క్యాంపులో 10 రోజుల వసతి కల్పిస్తాం. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు అన్ని విధాలుగా మంచి భవిష్యత్ ఉంటుంది. ఇందులో ఏ, బీ, సీ సర్టిఫికెట్లు పొందిన వారికి పలు రకాల రిజర్వేషన్లు లభిస్తాయి.

– విజయ్‌కుమార్, ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్

చాలా విషయాలు నేర్చుకున్నా..



క్యాంప్ ప్రారంభమైన రోజు నుంచి ఇప్పటి వరకు చాలా విషయాలపై సార్ వాళ్లు అవగాహన కల్పించారు. క్యాంప్‌లో డ్రిల్, ఫైరింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. దీంతో పాటు స్పోర్ట్స్, వ్యక్తిత్వ వికాస తరగతులు, సర్టిఫికెట్ ఎగ్జామ్‌పై అవగాహన కల్పించారు. నాకు ఇదో గొప్ప అనుభూతినిచ్చింది.

– నిఖిత, ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల

ఫైరింగ్ నేర్చుకున్నా..



ఎన్‌సీసీలో ప్రధానంగా క్యాడెట్‌కు ఓపిక, సహనం నేర్పిస్తుంది. క్రమశిక్షణ, జాతీయతా భావాన్ని పెంపొందిస్తుంది. మొదటి సారిగా నేను వెపన్ ట్రెనింగ్‌లో శిక్షణ తీసుకున్నా. 10రోజుల పాటు మరిన్ని అంశాలు నేర్చుకుంటా. సివిల్స్ రాయాలనే కళకోసం ఎన్‌సీసీలో చేరాను.

– సుగుణ, టీటీడబ్ల్యూఆర్‌డీసీ కళాశాల, మహబూబ్‌నగర్

బహుజన రాజ్యాధికారమే లక్ష్యం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



అభివాదం చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

కొల్లాపూర్: బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పీ పని చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మహబూబ్ ఫంక్షన్‌హాల్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి, బోయల ఆత్మగౌరవ సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టణంలో బీఎస్పీ నాయకులు నిర్వహించిన ప్రదర్శన ర్యాలీలో పాల్గొని అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రామ్ విగ్రహాలతో పాటు ప్రొ. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో పాల్గొని ప్రసంగించారు. లక్ష కన్నా తక్కువ జనాభా ఉన్న కులాల వారు సీఎం పీఠం అధిష్టిస్తున్నారని.. 90 శాతం కన్నా ఎక్కువ జనాభా ఉన్నవారు మాత్రం ఇంకా పదవుల కోసం బిచ్చమెత్తుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో 8 లక్షల జనాభా ఉన్న వాల్మీకి, బోయ కులస్తుల్లో కనీసం ఒక్క ఎమ్మెల్యే కూడా లేరని.. ఈ పరిస్థితికి అగ్రవర్ణ పాలకులే కారణమన్నారు. బహుజనులంతా ఏకమైతే అగ్రవర్ణాల వారికి రాజకీయ బిచ్చమేసే పరిస్థితులు వస్తాయని తెలిపారు. కాన్షీరాం, మాయావతి స్ఫూర్తితో బహుజనులకు రాజ్యాధికారంలో వాటా కల్పించేందుకే బీఎస్పీ పోరాటం చేస్తోందన్నారు. ప్రగతిభవన్‌తో పాటు చట్టసభల్లో వాల్మీకి, బోయలను కూర్చోబెడతామని.. వారిని ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. బోయలను ఎస్టీ జాబితా నుంచి తొలగించింది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. కొత్తగా కాంగ్రెస్‌లో చేరిన జూపల్లి కృష్ణారావు ఈ అంశంపై అధిష్టానాన్ని నిలదీయాలని కోరారు. బోయలను తిరిగి ఎస్టీ జాబితాలో చేరుస్తామని చెప్పి ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయిన బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. బహుజనులమంతా కలుద్దాం, నిలుద్దాం, గెలుద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బీఎస్పీ సభలకు ప్రజలను రానివ్వకుండా బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు అడ్డుపడుతున్నారని.. అయినా జనం స్వచ్ఛందంగా తరలివస్తున్నారన్నారు. ప్రవీణ్‌కుమార్ సమక్షంలో కొల్లాపూర్ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు బీఎస్పీలో చేరారు. సభలో బీఎస్పీ నాయకులు గగనం శేఖరయ్య, పసుపుల రామకృష్ణ, కొడిగంటి నర్సింహ, వెంకటేష్‌నాయుడు, మునిస్వామి, కేశపాగ వెంకటేష్, కారంగి బ్రహ్మయ్య, విద్యారాణి, పోతుగంటి బాలకృష్ణుడు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వారికే సీఎం పదవులా?

రాష్ట్రంలో 5 శాతం జనాభా కూడా లేనివారు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సీఎం పదవులు అనుభవిస్తుంటే.. 90 శాతానికి పైగా జనాభా ఉన్న బహుజనులు మాత్రం ఇప్పటికీ ఎమ్మెల్యే, మంత్రి పదవుల కోసం భిక్షమెత్తుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. వీటన్నింటికీ పరిష్కారం బహుజనులు రాజ్యాధికారంలోకి రావడమే అని పేర్కొన్నారు. బోయలను ఎస్టీ జాబితా నుంచి తొలగించిన కాంగ్రెస్ పార్టీకి, ఎస్టీ జాబితాలో చేర్చుతామని మోసం చేస్తున్న బీఆర్ఎస్‌కు వాల్మీకిలు బుద్ధిచెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలో 34 అసెంబ్లీ స్థానాలు బీసీలకు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పడం దారుణమని, బీసీలకు అసెంబ్లీ సీట్లు భిక్షమిస్తున్నారా అని ప్రశ్నించారు. బహుజనులపై ప్రేమ ఉంటే 90 శాతం సీట్లు వారికే ఇవ్వాలన్నారు. కోకాపేటలో భూములు కొనే స్థాయికి, ఐఏఎస్, ఐపీఎస్, సీఈఓల స్థాయికి బహుజనులు ఎదగకపోవడానికి అగ్రవర్ణ పాలకుల కుట్రలే కారణమని ఆరోపించారు.

ఆత్మరక్షణ కోసమే కరాటే..

- రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్



జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌ను ప్రారంభిస్తున్న ఎన్పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు: ఆత్మరక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఎస్ఎన్ గార్డెన్ ఫంక్షన్‌హాల్లో శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మొదటి జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు కర్నూల్, హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాల నుంచి 300 మంది కరాటే విద్యార్థులు హాజరయ్యారు. కుమితే, కతాస్, లాంగ్‌వెపన్, షార్ట్ వెపన్, టీమ్ కతాస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల దేహదారుఢ్యంతో పాటు మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. జిల్లా విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి కరాటే టోర్నీలో రాణించాలన్నారు. జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ నిర్వహించిన శ్రీహనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఫౌండర్, సీనియర్ కరాటే మాస్టర్ కె.వెంకటేశ్‌ను అభినందించారు. అనంతరం కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభచాటిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. కరాటే టోర్నీ ఆర్గనైజర్ మాస్టర్ కె.వెంకటేశ్, భీమమ్మ, సీపీఐ జిల్లా ఉపాధ్యక్షులు కోటకదిర నర్సింహులు, ముత్యం గురుస్వామి, రాంచంద్ర య్య, ప్రశాంత్‌కుమార్, బాల్‌లింగం, మాస్టర్ సత్యశంకర్, చందర్‌రావు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.